క్లుప్తంగా

బహుమతుల అందజేత



బాల్కొండ: బాలికల దినోత్సవం సందర్భంగా ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాధవి, హెచ్ఎం నరేందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు డ్రమ్ముల పంపిణీ



బాల్కొండ: ముప్కాల్ మండలం నాగంపేట్‌లో రైతులకు ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సబ్సిడీపై నీటి డ్రమ్ములను మంగళవారం పంపిణీ చేశారు. 26 మంది రైతులకు 200 లీటర్ల సామర్థ్యమున్న ప్లాస్టిక్ డ్రమ్ములను అందజేశారు. రైతులకు సబ్సిడీపై విత్తనాలు, వస్తువులను అందజేస్తున్నట్లు ఫౌండేషన్ ప్రతినిధులు చెప్పారు. ఫౌండేషన్ ప్రతినిధులు అఖిల, మధు, రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్, బంజారా భవనాల కోసం స్థల పరిశీలన



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో మంగళవారం ఆర్డీవో పర్యటించారు. కాలనీలో అంబేడ్కర్, బంజారా భవన్ నిర్మాణాల కోసం స్థలాలను పరిశీలించారు. ఆర్డీవో వెంట మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాధాకృష్ణ, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ డివిజన్ సభ్యులు దూప్‌సింగ్, కౌన్సిలర్ గంగారాం పాల్గొన్నారు.

దంతాల శుభ్రత ముఖ్యం



మాక్లూర్: దంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకుంటే ఎలాంటి దంత సమస్యలు రావని కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య అన్నారు. మంగళవారం దాస్‌నగర్ సాంఘిక సంక్షేమ మహిళ గురుకుల కళాశాలలో ఎస్ఎస్ఎస్, జీఆర్ మెమోరియల్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దంతాలపై అశ్రద్ధ ఉండకూడదన్నారు. వైద్యులు సూచించిన టూత్ పేస్టులను మాత్రమే వాడాలన్నారు. ప్రతి మూడు మాసాలకు ఒక్కసారి బ్రష్‌లను మార్చాలన్నారు. అనంతరం విద్యార్థినులకు జూనియర్ వైద్యులు దంత పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. సురేష్‌బాబు, సరిత, మమత, సునీత, రజిత, మాధురి, పాల్గొన్నారు.

పుస్తకాల ఆవిష్కరణ



నందిపేట్ (ఆర్మూర్): నందిపేట మండల కేంద్రానికి చెందిన బొమ్మనుల రాహుల్ రచించిన రెండు పుస్తకాలను తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, ఉస్మానియా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ రవీందర్ యాదవ్ ఆవిష్కరించారు. యూజీసీ నిర్వహించే నెట్ పరీక్షలో జాతీయ స్థాయిలో రాహుల్ జేఆర్ఎఫ్‌కు అర్హత సాధించారు అంతేకాకుండా కామర్స్ సబ్జెక్టులో తెలంగాణ సెట్, మేనేజ్మెంట్ సబ్జెక్టులలో నెట్‌కు అర్హత సాధించారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో కూడా గోల్డ్ మెడల్ సాధించారు. ప్రస్తుతం రాహుల్ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో కామర్స్ విభాగంలో పీహెచ్‌డీ కొనసాగిస్తున్నారు.

ప్రొఫెసర్ దీక్షకు మద్దతు

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాసిం చేస్తున్న నిరసన దీక్షకు తెలంగాణ యూనివర్సిటీ పీడీఎస్‌యూ సంపూర్ణ మద్దతు తెలియజేస్తుందని అధ్యక్షుడు సంతోష్ తెలిపారు. మంగళవారం తెయూ క్యాంపస్‌లో సంతోష్ మాట్లాడుతూ.. రాష్ట్ర బడ్జెట్లో తెలంగాణ యూనివర్సిటీకి కేవలం రూ.39 కోట్ల నిధులు కేటాయించడం శోచనీయమన్నారు.

ప్రారంభానికి నోచుకోని భవనాలు

- వల్లభాపూర్, ముల్లంగి(బి) జీపీ భవనాలకు నిధుల లేమి
- కలెక్టర్ స్పందించాలని ప్రజాప్రతినిధుల వేడుకోలు



అసంపూర్తిగా ముల్లంగి (బి) జీపీ భవనం



ప్రారంభానికి సిద్ధమైన వల్లభాపూర్ భవనం

మాక్లూర్: వల్లభాపూర్ జీపీ నూతన భవనం దాదాపు పూర్తయినా మిగిలి ఉన్న కొద్దిపా టి పనులను పూర్తి చేయటానికి నిధులు లేక ప్రారంభానికి నోచుకోవటం లేదు. కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఆర్‌జీపీఎస్ఏ నుంచి రూ.20 లక్షల చొప్పున నిధులు ఇస్తూ నూతన భవనాలు నిర్మించుకోవాలంటూ ఆయా గ్రామాల సర్పంచ్‌లకు బాధ్యతలు అప్పగించారు. మండలంలో అలా మంజూరైన వల్లభాపూర్, ముల్లంగి(బి) జీపీ భవనాలు నిధులు లేక అలంకారప్రాయంగా మిగిలాయి. సర్పంచ్‌లు వచ్చిన నిధులతో పనులు మొదలు పెట్టగా ముల్లంగి(బి) జీపీ భవనం స్లాబ్ వేసి వదిలేశారు. అక్కడితో నిధులు ఖర్చు అయిపోయి మిగితా పనులు చేయించటానికి డబ్బు లు లేక అలాగే పెండింగ్‌లో పెట్టారు. వల్లభాపూర్ జీపీ భవనం మొత్తం పూర్తయింది. కేవలం కిటికీలు, డోర్లు, హౌస్ వైరింగ్ పనులు చేయాల్సి ఉంది. మరో రూ.2 లక్షలు సమకూరితే పనులు పూర్తయి భవనం ప్రారంభించుకోవచ్చని సర్పంచ్ మంజుల అంటున్నారు. కలెక్టర్ స్పందించి రూ.2 లక్షల మంజూరు చేయాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని జమ్మన్‌జెట్టి గల్లీ మత్స్య కార్మికుల సంఘం ఎదుట బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి, ఆర్మూర్ పట్టణ మత్స్య సెల్ కన్వీనర్ మార్వాడి పోశెట్టి మాట్లాడుతూ.. ఎన్నడూ లేని విధంగా కేంద్ర ప్రభుత్వం ఈసారి బడ్జెట్లో మత్స్య కార్మికుల అభివృద్ధి కోసం రూ.6 వేల కోట్లు ప్రత్యేకంగా కేటాయించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జెస్సు అనిల్, ప్రధాన కార్యదర్శి ఆకుల రాజు, ఆకుల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు

విద్యుత్ కోతలకు నిరసనగా అర్ధనగ్న ప్రదర్శన



బాల్కొండ: విద్యుత్ కోతలపై ముప్కాల్ మండల కేంద్రానికి చెందిన రైతు లోక రాములు అర్ధనగ్నంగా జాతీయ రహదారి–44పై మంగళవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ.. కరెంట్ ఎప్పుడు వస్తుందో.. పోతుందో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2 రోజుల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వస్తుందన్నారు. పంటలకు నీరు ఎలా అందించాలని వాపోయారు. ముప్కాల్ ఏఎస్సై సురేశ్, రైతును సముదాయించి ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడించారు. దీంతో రైతు నిరసనను విరమించారు.

పంట వివరాలు నమోదు చేయండి



అమ్దాపూర్‌లో పంటలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్



మోతెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

- పీఎం కిసాన్ కోసం ఈ–కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలి
- జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్

బోధన్ రూరల్ (రూరల్): వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి రబీ సీజన్లో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను పకడ్బందీగా ఆన్‌లైన్లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. మంగళవారం అమ్దాపూర్‌లో ఆయన పర్యటించి పంటల వివరాల నమోదు ప్రక్రియ, రైతులు సాగు చేస్తున్న పంటలను పరిశీలించి స్థానిక పోస్ట్ ఆఫీస్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన రైతులు పీఎం కిసాన్ 13వ విడత డబ్బులు పొందేందుకు బ్యాంక్ అకౌంట్‌కి ఆధార్‌ను తప్పనిసరిగా లింక్ చేసుకోవాలన్నారు. ప్రస్తుతం వరిలో కాండం తొలుచు పురుగు, ఆకు చుట్టు పురుగు అక్కడ అక్కడ కనిపిస్తోందని, దీని నివారణకు ఫిప్రోనిల్ గుళికలు, కార్టాప్ హైడ్రోక్లోరైడ్ మందులను వ్యవసాయ శాఖ అధికారుల సూచన మేరకు తగిన మోతాదులో వాడాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో గంగజాల, రైతులు పాల్గొన్నారు

ఆధార్ అనుసంధానం చేసుకోవాలి

వేల్పూర్: పీఎం కిసాన్ పథకం ద్వారా ఆర్థిక సహాయం పొందడానికి రైతులు తమ బ్యాంకు అకౌంటుకు ఆధార్ నంబరును అనుసంధానం చేసుకోవాలని వేల్పూర్ మండల వ్యవసాయాధికారి నర్సయ్య పేర్కొన్నారు. తపాలాశాఖతో కలిసి మోతెలో మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు. పీఎం కిసాన్‌ద్వారా ఏడాదికి మూడు విడతలుగా రూ.6 వేలు అకౌంటులో జమవుతాయన్నారు. పోస్టల్ టీవో. యువన్ కుమార్, ఏఈవో షబ్బీర్, బీపీఎం శ్రీకాంత్ పాల్గొన్నారు.

వ్యక్తిగత దూషణలపై పోలీసులకు ఫిర్యాదు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా, అసభ్యకరమైన పోస్టులు పెట్టిన బీజేపీ నాయకుడుపై ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబుకు బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేపై వ్యక్తిగత దూషణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీజేపీ నాయకులు చేసిన అభివృద్ధి ఏమీ లేకపోవడంతో, ప్రజలను రెచ్చగొట్టడడం, వ్యక్తిగత దూషణలే లక్ష్యంగా పెట్టుకున్నారని, ఇది సరైన రాజకీయం కాదని అన్నారు. ఇకనైనా ఇలాంటి చర్యలు ఆపేయాలని హితవు పలికారు. కార్యక్రమంలో ఎస్సీ సెల్ అధ్యక్షుడు జన్నపల్లి రంజిత్, టెలికాం డైరెక్టర్ షాహిద్, ఆర్మూర్ పట్టణ యువజన కమిటీ అధ్యక్షుడు గుంజాల పృథ్వీరాజ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

నందిపేట్ (ఆర్మూర్): మండల కేంద్రంలోని శ్రీ సాయి జూనియర్ డిగ్రీ కళాశాలలో ఫుడ్ బ్యాంక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు ఆకలి కేకలు లేని నిర్మాణానికి నేటి యువత పాత్ర అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫుడ్ బ్యాంక్ ఫౌండర్ నవీన్ చంటి మాట్లాడుతూ.. సాటి మనిషి పట్ల దయతో ఉండి శరణార్థుల ఆకలి తీర్చడం ఎంతో గొప్ప విషయం అన్నారు. ప్రతి వ్యక్తి తన బాధ్యతగా సాటి వారిని ఆదుకోవాలని అన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కళాశాల డైరెక్టర్ నాగ సురేష్ అడ్వొకేట్ కల్పన, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతులిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

సీఎంఆర్ఎఫ్ పథకంతో నిరుపేదలకు మేలు



బోధన్ రూరల్ (బోధన్): సీఎంఆర్ఎఫ్ పథకంతో నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుందని బోధన్ ఎంపీపీ బుద్దె సావిత్రి అన్నారు. మంగళవారం బోధన్ మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 12 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే షకీల్ చొరవతో నియోజకవర్గంలో ఆపత్కాలంలో అనేకమందికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందుతుందన్నారు. ఎన్డీసీసీ బ్యాంక్ డైరెక్టర్లు గంగారెడ్డి, శరత్, ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, వైస్ చైర్మన్ షకీల్, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

క్యాంటీన్ల ప్రతిపాదనను విరమించుకోండి

మోర్తాడ్: తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో మటన్ క్యాంటీన్లను ప్రారంభిస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం సరైంది కాదని ఆరెకటిక సంఘం సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం మోర్తాడ్ తహసీల్దార్ బావయ్యకు వినతి పత్రాన్ని వారు అందించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు వాంకారి మోహన్, కార్యదర్శి వాంకారి శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. మటన్ వ్యాపారంపై లక్షలాది మంది ఆరెకటికలు ఆధారపడ్డారని, ప్రభుత్వం ఏర్పాటు చేయడం వల్ల ఆరెకటికలు జీవనోపాధి కోల్పోతారని వెంటనే నిర్ణయాన్ని విరమించుకోవాలని విన్నవించారు.



వినతి పత్రం అందిస్తున్న ఆరెకటిక సంఘం సభ్యులు

వధూవరులకు కొత్త బట్టలు



కల్యాణ లక్ష్మి చెక్కులతో పాటు కొత్త బట్టలు అందజేస్తున్న ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

– ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా

నిజామాబాద్‌నాగారం: ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం నగరంలోని నూతన వధూవరులకు సొంత ఖర్చులతో కొత్త బట్టలు అందజేస్తానని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా తెలిపారు. మంగళవారం నగరంలోని న్యూ అంబేడ్కర్ భవనంలో 198 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు, నూతన వధూవరులకు కొత్త బట్టలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే గణేశ్ మాట్లాడుతూ.. ప్రతి ఇంటికి సంక్షేమం, ప్రతి ఒక్కరి ముఖంలో సంతోషమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. దేశానికి కేసీఆర్ నాయకత్వం కావాలని ఆకాంక్షిస్తున్నారని, సంక్షేమ పథకాలే తెలంగాణకి రోల్ మోడల్ అన్నారు. అలాగే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను 59 మంది బాధిత కుటుంబాలకు పంపిణీ చేశారు.

ప్రత్యేక జిల్లా సాధించే వరకు పోరాటం ఆగదు



బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా సాధించే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని న్యాయవాదులు అన్నారు. ఈ ప్రాంత ప్రజలు ప్రత్యేక జిల్లా కోరుతున్నారని, స్థానిక అధికార పక్ష ముఖ్య ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 51వ రోజుకు చేరాయి. దీక్షలో న్యాయవాదులు సీహెచ్‌వీ హన్మంతరావు, శంకర్, అర్జున్ రండార్, విద్యార్థి జేఏసీ ప్రతినిధి శివకుమార్‌లు కూర్చున్నారు. న్యాయవాది కులకర్ణి దత్తాత్రిరావు దీక్షలను ప్రారంభించారు.

హరితహారం మొక్కలకు నీటి కొరత



నీరు అందక ఎండుతున్న మొక్కలు

బాల్కొండ : బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో అవెన్యూ ప్లాంటేషన్‌కు నీటి కొరత ఏర్పడుతోంది. హరితహారంలో భాగంగా ప్రతి గ్రామ శివారులో రోడ్డుకిరువైపులా మొక్కల పెంపకం చేపట్టారు. కానీ ప్రస్తుతం ఎండలు మెండుగా కాస్తుండటంతో సరైన సమయంలో నీరు అందక ఎండిపోతున్నాయి. వాటర్ సరఫరాకు కావాల్సిన ట్యాంకర్ వల్లే ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ప్రతి గ్రామ పంచాయతీకి ఒక వాటర్ ట్యాంక్ ఉంది. కానీ ఆ వాటర్ ట్యాంక్ కదలాలంటే ట్రాక్టర్ కావాలి. జీపీలో చెత్త సేకరణకు వినియోగించే ట్రాక్టరే దిక్కు. గ్రామంలో చెత్త సేకరణ కోసం అధికంగా ట్రాక్టర్‌ను వినియోగించడంతో మొక్కలకు నీరు అందించటానికి సకాలంలో ట్యాంకర్ తీసుకుపోవడం లేదు. మొక్కల పెంపకం ఏదో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లదే బాధ్యత అన్నట్లుగా కొన్ని జీపీల్లో కార్యదర్శులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి సకాలంలో వాటర్ ట్యాంకుతో నీటి సరఫరా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. సమన్వయంతో పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మండలానికి 300 'డబుల్' ఇళ్లిస్తాం



రాంపూర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎమ్మెల్సీ వీజీగౌడ్

- ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి 2 వేల డబుల్‌బెడ్ రూం ఇళ్లను మంజూరు చేసిందని, ఇందులో భాగంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ప్రతి మండలానికి 300 ఇళ్ల చొప్పున ఇస్తామని ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ తెలిపారు. రాంపూర్ గ్రామంలో రూ.7.56 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు బాజిరెడ్డి గోవర్ధన్ మంగళవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. ఎలాంటి అభివృద్ధి పనులు చేయకుండా బీఆర్ఎస్ పార్టీని, రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించే వారికి గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధిని చూపి గట్టిగా సమాధానం ఇవ్వాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అభివృద్ధి పనులు చేసిన వారికే మరోసారి పట్టం కట్టాలని కోరారు. రాంపూర్, చీమనపల్లి గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయిస్తానని బాజిరెడ్డి హామీ ఇచ్చారు.

రాజకీయ జీవితం ఇచ్చారు: వీజీ గౌడ్

స్వగ్రామమైన రాంపూర్‌తో పాటు చుట్టూ ఉన్న ఏడు గ్రామాల ప్రజలు తనకు రాజకీయ జీవితాన్ని ఇచ్చారని, వారి ఆశీస్సులతో ఈ స్థాయికి ఎదిగానని ఎమ్మెల్సీ వీజీ గౌడ్ తెలిపారు. రాంపూర్ సొసైటీ చైర్మన్‌గా 30 ఏళ్ల పాటు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని, 9 సంవత్సరాల పాటు డీసీసీబీ చైర్మన్‌గా పని చేశానన్నారు. రెండు సార్లు ఎమ్మెల్సీని అయ్యానని, రాజకీయ జీవితాన్ని ఇచ్చిన ప్రజల కోసం పలు అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. పదవులు శాశ్వతం కావని, చేసిన అభివృద్ధిని ప్రజలు జీవితకాలం గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. డీసీఎంఎస్ చైర్మన్ సాంబరి మోహన్, జెడ్పీటీసీలు బాజిరెడ్డి జగన్, దాసరి ఇందిరలక్ష్మీనర్సయ్య, సర్పంచి పాపాయి తిరుపతి, ఎంపీటీసీ పోతర్ల సుజాతరవి, సొసైటీ చైర్మన్ తారాచంద్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చింత శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో గోపిబాబు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమం ప్రారంభం

డిచ్‌పల్లి: రాంపూర్‌లో రూ.కోటి వ్యయంతో అన్ని హంగులతో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ వృద్ధాశ్రమ భవనాన్ని మంగళవారం ఎమ్మెల్సీ వీజీగౌడ్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రారంభించారు. వృద్ధాశ్రమం ఆవరణలో రూ. 5 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేస్తున్న గ్రీన్ పార్క్ పనులకు శంకుస్థాపన చేశారు.

గైని గుట్టలో శివస్వాముల పూజలు



గైని గుట్ట బసవేశ్వర ఆలయం వద్ద భిక్ష స్వీకరిస్తున్న శివస్వాములు

రుద్రూర్: సులేమాన్‌నగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని గైని గుట్ట స్వయం భూబసవేశ్వర ఆలయంలో మంగళవారం శివ మాలధారణ స్వాములు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శివ స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పరమేశ్వర మహరాజ్, వివిధ గ్రామాల శివ మాలధారణ స్వాములు పాల్గొన్నారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో హోమం

రుద్రూర్: మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ దేవి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన ఎంబరి గంగారాం కుటుంబ సభ్యులు దేవికి ఖడ్గం సమర్పించారు. ప్రసాద వితరణ చేశారు.



రేణుక ఎల్లమ్మ ఆలయంలో హోమం నిర్వహిస్తున్న భక్తులు

సమాచారం..

11న బోధన్ కోర్టులో లోక్ అదాలత్

బోధన్: జాతీయ న్యాయ అధికార సంస్థ ఆదేశాల మేరకు ఈ నెల 11న బోధన్ కోర్టులో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు మండల న్యాయ సేవ అ ధికార సంస్థ చైర్మన్, ఐదవ అదనపు జిల్లా న్యాయమూర్తి రవికుమార్ మంగళవారం తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు లోక్‌అదాలత్ కొనసాగుతుందని తెలిపారు. మూడు బెంచ్‌లను ఏర్పా టు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేతన్నలకు అన్యాయం

నిజామాబాద్‌నాగారం: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్లో నేతన్నల సంక్షేమానికి ఒక్క రూపాయి కేటాయించకుండా అన్యాయం చేశారని జాతీయ చేనేత ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర కమిటీ కోశాధికారి సిలివేరి గణేష్ మంగళవారం తెలిపారు. అసెంబ్లీలో ఆర్థిక మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత నేతన్నలు ఎంతో అభివృద్ధి పథంలో నడుస్తున్నారని మాయమాటలు చెప్పడం తప్ప నిధులు కేటాయించకపోవడం శోచనీయమని అన్నారు. నేతన్నలు అంత తెలివి తక్కువ వారు ఏమీ కాదని హితవు పలికారు. ఇప్పటికైనా ప్రభుత్వం చేనేత రంగానికి చేయూతనిచ్చి కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.